క్లుప్తంగా

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కోస్గి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల్లో ఆర్థిక భరోసా నింపేందుకు తెలంగాణ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేపట్టిందని మండల తహసీల్దార్ బక్క శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోస్గి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 109 మంది లబ్ధిదారులకు చెక్కులు మంజూరైనట్లు తెలిపారు.

● ఉమ్మడి మద్దూరు మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేయనున్నట్లు మద్దూరు, కొత్తపల్లి మండలాల తహసీల్దార్లు మహేష్‌గౌడ్, జయరాములు వేర్వేరు ప్రకటనలో తెలిపారు. మద్దూరు తహసీల్దార్ కార్యాలయంలో 11:30 గంటలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో 12 గంటలకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



కోస్గి రూరల్: రోడ్డు వెడల్పు పనుల్లో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పునఃనిర్మించేందుకు కోటి రూపాయలు మంజూరు చేయడం హర్షనీయమని కాంగ్రెస్ నాయకులు మోహన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీ అనుబంధ గ్రామమైన సంపల్లిలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేపట్టారు. అంగన్‌వాడీ భవనానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, వెంకటయ్య, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

కంటివైద్య శిబిరం విజయవంతం

కోస్గి రూరల్: జిల్లా అంధత్వ నివారణ సంస్థ కోస్గి లయన్స్ క్లబ్ శాఖ వారి ఆధ్వర్యంలో సంయుక్తంగా చేపట్టిన కంటి వైద్య శిబిరం విజయవంతమైందని వైద్యులు భాస్కర్‌గౌడ్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేపట్టిన శిబిరంలో 70 మంది రోగులను పరీక్షించగా, అందులో 28 మందికి కంటిలో శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. వారిని జిల్లాలోని రాంరెడ్డి కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు పూర్ణచంద్రయాదవ్, వెన్నశేఖర్, తదితరులు ఉన్నారు.

తీరనున్న సాగునీటి కష్టాలు

కృష్ణా: కృష్ణా, మాగనూర్ ఉమ్మడి మండలాల్లోని కృష్ణా నది తీరంలోని ఎత్తిపోతల పథకాల కింద రబీలో సాగు చేసిన వరి పంటలకు అవసరమయ్యే సాగునీటిని కర్ణాటక ప్రభుత్వం విడుదల చేస్తుండడంతో పంటలకు ఇబ్బందులు ఉండవని రైతులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మంత్రి జూపల్లి కృష్ణారావు, గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణామోహన్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌తో కలిసి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లను కలిసి కృష్ణానదిపై ఎగువన ఉన్న కర్ణాటకలోని నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి సాగు, తాగునీటి అవసరాల నిమిత్తం 5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తి మేరకు కర్ణాటక ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించడంతో నదితీరంలోని రైతులు, ఎత్తిపోతల పథకాల కింద వరిసాగు చేసిన రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



నారాయణపేట: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించి సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎస్‌ఐ రేవతి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించి రూ.12,560 జరిమానా విధించారు. 5 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. పెండింగ్‌లో ఉన్న 61 ఈ చలాన్ రూ. 24,100 జరిమానా కట్టించారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కొత్తపల్లి: మండలంలోని భూనీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీం సభ్యులు చెన్నప్ప, బాల్‌రాజ్ విద్యార్థులకు సైబర్ క్రైమ్, యూటీజింగ్, బాల్య వివాహాలు, ర్యాగింగ్ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమలో షీటీం సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

● పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ



కున్సీ పాఠశాలలో బియ్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ

సాక్షి, నెట్‌వర్క్: దామరగిద్ద మండలంలోని సజనాపూర్ ప్రాథమిక పాఠశాలలో తహసీల్దార్ దయాకర్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలని ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం కూరగాయలు, గుడ్లు, పండ్లతో కూడిన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● కొత్తపల్లి మండలంలోని గొర్లోనిబాయి, నిడ్జింత ఉన్నత పాఠశాలలను కొత్తపల్లి ఎంపీడీఓ కృష్ణారావ్, మండల విద్యాధికారి ఆంజనేయులుతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంటకు వినియోగిస్తున్న బియ్యం స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్, ఓంకార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కృష్ణా మండలంలోని అన్ని పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలన్నదే తమ లక్ష్యంగా పెట్టుకున్నామని తహసీల్దార్ వెంకటేష్ అన్నారు. కున్సీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ జానయ్య, ఎంఈఓ నిజాముద్దీన్‌లతో కలిసి వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి, హెచ్‌ఎం శివరాజ్, ఉపాధ్యాయులు నరేందర్, తదితరులు ఉన్నారు.



కొత్తపల్లి పాఠశాలను సందర్శించిన ఎంఈఓ అనిల్‌కుమార్‌గౌడ్

సాక్షి ఎఫెక్ట్..

మాగనూర్: మండలంలోని పుంజనూర్ పాఠశాలకు జాతర పేరుతో వరుసగా రెండు రోజులు సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు గురువారం 'సాక్షి' దినపత్రికలో ''జాతర పేరుతో తెరుచుకోని బడి'' శీర్షికతో రావడంతో మండల విద్యాధికారి అనిల్‌కుమార్‌గౌడ్ తనిఖీ చేశారు. మండలంలోని కొత్తపల్లి, తళంకేరి, గురువలింగంపల్లి పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 10 గంటలు దాటినా పుంజనూర్ పాఠశాలకు ఉపాధ్యాయులు ఎవరు రాకపోవడంతో విద్యార్థులు ఇంటి ముఖం పట్టారు. దీంతో ఎంఈఓ స్పందించి మరో పాఠశాల నుంచి ఇక్కడికి ఉపాధ్యాయుడిని పంపించారు. అతడు మళ్లీ గ్రామంలోని విద్యార్థులను పాఠశాలకు తీసుకొచ్చి పాఠాలు బోధించారు. ఎంఈఓ మాట్లాడుతూ విధుల పట్ల ఉపాధ్యాయులు నిర్లక్ష్యం విడనాడాలని, సమయపాలన తప్పకుండా పాటించాలని తెలిపారు.

శివనామస్మరణతో మార్మోగిన మాద్వార్

● 101 కలశాలతో ఊరేగింపు

మక్తల్: మండలంలోని మాద్వార్ గ్రామంలో గురువారం గట్టు తిమ్మప్ప దేవాలయం దగ్గర శివ స్వాముల శివపూజ నిర్వహించారు. శివ నామస్మరణలతో మాద్వార్ గ్రామం మార్మోగింది. గ్రామంలో నుంచి దేవాలయం వరకు 101 కలశాలతో ఊరేగింపును నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దైవ భక్తి అలవర్చుకోవాలని, దేవునిపై భక్తితో పూజలు చేస్తే తప్పకుండా ముక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని మక్తల్, ఊట్కూర్, మాగనూర్, నర్వ, నారాయణపేట మండలాలకు చెందిన 100 మంది శివస్వాములు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ రాజేశ్వర్‌రావు, శివభక్తులు నారాయణరెడ్డి, కృష్ణ, సిద్ధు, తిరుపతిరెడ్డి, పలువురు పాల్గొన్నారు.



మాద్వార్‌లో కలశాలతో వెళ్తున్న భక్తులు

స్నేహ సంబంధాలు మెరుగుపరుచుకోవాలి



నిడ్జింత,పెదిరిపాడ్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొత్తపల్లి: విద్యార్థులు ఒకరినొకరు స్నేహ సంబంధాలు మెరుగు పరుచుకోవాలని కొత్తపల్లి, మద్దూరు మండలాల విద్యాధికారులు ఆంజనేయులు, బాలకిష్టప్ప అన్నారు. పీఎంశ్రీ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని నిడ్జింత పాఠశాలను మద్దూరు మండలంలోని పెదిరిపాడ్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకిష్టప్ప సందర్శించారు. పరిసరాల పరిశుభ్రత, వాటి పరిరక్షణ విద్యా ర్థులు తెలుసుకోవాలని సూ చించారు. పాఠశాలో ఏకో పార్క్, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, ఆఫీస్ రూం, డిజిటల్ క్లాసులు, వాష్‌రూం నిర్వహణ, గేమ్స్ సంబంధించిన విషయాలు, ప్రతి క్లాస్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఇరు పాఠశాలల ఉపాధ్యాయులు లాజర్, కే.శ్రీనివాస్, వేణుగోపాల్, దేవేంద్రప్ప, ఆనందము, రాజరత్నం, రవికుమార్, స్వప్న, శబరి, కతలప్ప, ఓఎస్ షఫీ, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సిబ్బందికి సన్మానం

ధన్వాడ: మండలంలోని యంనోనిపల్లి గ్రామ పంచాయతీ కారోబార్ వెంకట్‌రాములును బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సన్మానించారు. గ్రామంలో ప్రతిరోజు అందుబాటులో ఉంటూ గ్రామ పూరవీధులు శుభ్రం చేస్తూ టైం ప్రకారం మిషన్ భగీరథ నీటిని వదులుతూ, ట్యాంకులను శుభ్రం చేయడంతో పాటు ప్రతి పనిని గ్రామ వాట్సాఫ్ గ్రూపులో పెడుతున్నట్లు పేర్కొన్నారు. దీంతో వారికి నగదు బహుమతి అందజేశామని మాజీ ఎంపీటీసీ సుదీర్ కుమార్ తెలిపారు. మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, నరసింహరెడ్డి, రాములు, చంద్రకాంత్, అశోక్, రవికుమార్, రాములు, రవి, వెంకటేష్ పాల్గొన్నారు.



కారోబార్‌ను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సింథటిక్ కెమికల్ ప్లాంట్ నిలిపేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు

మరికల్: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీలో ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా కొత్తగా సింథటిక్ కిమికల్స్ అనే అమోనియం ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తోందని ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు గురువారం తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి మాట్లాడుతూ ఇప్పటికే ఇథనాల్ ఉత్పత్తి వల్ల విపరీతమైన దుర్వాసన వస్తోందని, అదనంగా కొత్తగా సింథటిక్ కిమికల్స్ అనే అమోనియం ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తే ప్రజలకు ప్రమాదకరమైన వ్యాధుల వచ్చే అవకాశం ఉందన్నారు. గతంలో కంపెనీ రద్దు కోసం పోరాటం చేసిన వారిపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయించాలని తహసీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, చక్రవర్తి, తిమ్మప్ప, రాంచంద్రయ్య, యదగిరి, సరోజనమ్మ, మల్లేష్ పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి

ధన్వాడ: దళితుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం పనిచేస్తోందని ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఆనంద్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని కిష్టాపూర్‌లో గత ప్రభుత్వం భూమిలేని దళితులకు అందజేసిన 150 ఎకరాల్లో ఉచిత బోర్లు డ్రిల్ చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని అయన తెలిపారు. ఇద్దరు రైతులకు కలిసి ఒకటి చొప్పున మొత్తం 23 బోర్లను జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారులు డ్రిల్ చేయించారు. బోరు డ్రిల్లింగ్‌ను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం రూ.19 లక్షలు మంజూరు చేసిందన్నారు. కేవలం బోర్ల డ్రిల్లింగ్ మాత్రమే వేస్తున్నామని, తరువాత విద్యుత్‌శాఖ ద్వారా అంచనాలు వేయించి విద్యుత్ సరఫరా మోటార్లు అందజేయనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అబ్దుల్ ఖలీల్ వెల్లడించారు. కార్యక్రమంలో రమాదేవి, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి అశోక్ బాబు, నరేస్, ప్రదీప్, బాలరాజు పాల్గొన్నారు.



కిష్టాపూర్‌లో బోరు డ్రిల్లింగ్‌ను పరిశీలిస్తున్న మేనేజర్ ఆనంద్‌కుమార్

జాతీయ సాంకేతిక అధికారిగా ధన్వాడ వాసి

ధన్వాడ: భారత ప్రభుత్వం నిర్వహించే 38వ జాతీయ క్రీడల్లో భాగంగా ఈ నెల 7 నుంచి ఉత్తరాఖండ్ రాష్ట్ర రాజధాని డెహ్రాడూన్‌లో జరిగే ట్రెడిషన్ నెట్‌బాల్, ఫాస్ట్ 5 నెట్‌బాల్ మిక్స్ డ్ నెట్‌బాల్ పోటీలకు ధన్వాడ నివాసి కొండాపూర్ గిరిజన గురుకుల పాఠశాల సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రామ్మోహన్‌గౌడ్ జాతీయ సాంకేతిక అధికారిగా (నేషనల్ టెక్నికల్ అఫీషియల్ ఎన్‌టీఓ)నియమించారు. నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్ష కార్యదర్శులు సుమర్ కౌశిక్ విజయేందర్ సింగ్‌లు నియమించినట్లు ఆయన తెలిపారు. దీని కోసం సహకరించిన రాష్ట్ర నెట్‌బాల్ సంఘం అధ్యక్షులు విక్రమాదిత్యరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గురుకుల ప్రిన్సిపాల్ రాజారాం అభినందనలు తెలిపారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు

మరికల్: మండలంలోని ఎక్లాస్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారికి అభిషేకం, గణపతి, నవగ్రహ, మృత్యుంజయ, రుద్ర హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నరసింహస్వామి, రాములమ్మ, భానుచందర్, శ్రీనాథ్, రామకృష్ణ పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు



ధన్వాడ: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు గురువారం పూజలు నిర్వహించారు. శుక్రవారం బొడ్రాయి ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయ భూములను సర్వే చేపట్టాలి



కోస్గి రూరల్: పట్టణ శివారులోని శంభోమహాదేవుని ఆలయ భూముల్లో సర్వే చేపట్టి హద్దులు గుర్తించాలని తహసీల్దార్ శ్రీనివాసులుకు ఆలయ కమిటీ అధ్యక్షులు సోమశేఖర్, కార్యదర్శి రాజేందర్‌రెడ్డిలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుడి శిథిలావస్థకు చేరిందని, ఎన్ని ఎకరాల మాన్యం ఉంది, వాటి సుంకం వివరాలు, ఎవరైనా భూములు స్వాధీన పరచుకుంటే హద్దులు నిర్ణయించాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ వెంకట్రాములు, రమేష్, వెంకట్, పూజారి విశ్వనాథ్‌స్వామి ఉన్నారు.

రోడ్లకు నిధులు మంజూరు



మక్తల్: ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి నియోజకవర్గ అభివృద్ధి తన ధ్యేయంగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అహర్నిశలు శ్రమిస్తున్నారని, అందులో భాగంగానే తాజాగా మక్తల్ నియోజకవర్గంలో నూతన రోడ్లు, రోడ్ల మరమ్మతులకు రూ.30.73 కోట్లు మంజూరు చే యించారని కాంగ్రెస్ నేతలు తెలిపారు. గురువారం వారు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో నూతన బీటీ రోడ్ల కోసం రూ.15 కోట్లు, ఇతర చోట్ల మరమ్మతులకు రూ.15.73కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కట్టా సురేష్‌గుప్తా, గణేష్, రవికుమార్, ఫయాజ్, చంద్రకాంత్‌గౌడ్, నూరుద్దీన్, శంషోద్దీన్, అస్మొద్దీన్, బోయ నర్సింహ, బాబు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించాలి

ధన్వాడ: మధ్యాహ్న భోజన పథకం బిల్లులు చెల్లిండంతో పాటు కోడిగుడ్లను ప్రభుత్వమే అందించాలని ఏఐటీయూసీ కార్యవర్గ సభ్యులు వెంకటేష్ డిమాండ్ చేశారు. మధ్యా హ్న భోజన కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారి గాయత్రికి వినతిపత్రం అందజేశారు. రేఖమ్మ, ఎర్రమ్మ, సువర్ణ, లక్ష్మి, అనురాధ, హసీనాబేగం పాల్గొన్నారు.

మానవ జన్మ మహోన్నతమైనది

ఊట్కూర్: అన్నిజన్మలకంటే మానవజన్మ మహోన్నతమైందని పంచమ సిద్దలింగేశ్వరస్వామి అన్నారు. మండలంలోని సమస్తాపూర్‌లో గురువారం ధార్మిక ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దైవచింతన వల్ల ముక్తి మార్గం లభిస్తుందని, నిత్య ధ్యానం, పూజ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నేరడగాం విరక్త మఠం ఆధ్వర్యంలో మార్చి 17న ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీగురుసిద్దస్వామి, శివబస్వస్వామి, చంద్రశేఖర్ స్వామి, భక్తులు నారాయణరెడ్డి, ఎల్లప్ప, భాస్కర్ రెడ్డి, వెంకటేశెట్టి, నర్సింహులు పాల్గొన్నారు.



సమస్తాపూర్‌లో మాట్లాడుతున్న సిద్దలింగేశ్వర స్వామి

విద్యార్థులకు రోబోటిక్స్‌పై శిక్షణ



రెనివట్లలో రోబోటిక్స్‌పై విద్యార్థులకు శిక్షణ

మద్దూరు: మండలంలోని రెనివట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోహం సంస్థ ఆధ్వర్యంలో గురువారం పాఠశాలలో 100 మంది విద్యార్థులకు రోబోటిక్స్‌పై శిక్షణ అందించారు. జిల్లాలో రోబోటిక్స్ ఇన్ అకాడమిక్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు 12 పాఠశాలల్లో రోబోటిక్స్‌లోని ప్రాథమిక సూత్రాలను అందించామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ శిక్షణ తీసుకున్న విద్యార్థులు ఏడాది పొడవునా ఇన్నోవేషన్ చాలెంజ్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఏఎండీ సంస్థ స్పాన్సర్‌షిప్‌తో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయికుమార్, వీరయ్య, బాలరాజు, సతీష్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

వైజ్ఞానిక ఆలోచనలు అలవర్చుకోవాలి

మద్దూరు: విద్యార్థులు వైజ్ఞానిక ఆలోచనలు అలవర్చుకోవాలని విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్ తెలిపారు. సమాజంలో ముడనమ్మకాలతో చాలా మంది మోసపోతున్నారని, వాటిని నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. గురువారం మండలంలోని పెదిరిపాడ్ ఉన్నత పాఠశాలలో మూడనమ్మకాలు, సైబర్ క్రైం, డ్రగ్స్, తదితర అంశాలపై డీవైఎఫ్‌ఐ, విజ్ఞాన దర్శిని ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విజ్ఞాన దర్శిని సభ్యులు మంటలను మింగడం, ఒంటికి మంటలు రాసుకోవడం, గాలిలో దయ్యం, గాజుపెంకులపై నడవడం లాంటి ప్రదర్శనలు విద్యార్థులతో చేయించారు. కార్యక్రమంలో విజ్ఞాన దర్శిని రాష్ట్ర నాయకులు శోభారాణి, అలీ, పద్మ, విష్ణు, పాఠశాల హెచ్‌ఎం బాలకిష్టప్ప, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రదర్శన ఇస్తున్న విజ్ఞానదర్శిని ప్రతినిధులు

గ్రామాల్లో పేదల అభ్యున్నతే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేష్

కృష్ణా: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అనుబంధంగా లేరాడ అనే స్వచ్ఛంద సంస్థ గ్రామాల్లోని పేదలు అభ్యున్నతే లక్ష్యంగా కృషి చేస్తోందని తహసీల్దార్ వెంకటేష్ అన్నారు. గురువారం స్వచ్ఛంద సంస్థ వారు మొట్టమొదటగా కున్సీ గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సంస్థ కృష్ణా మండలంలోని మొదట 10 గ్రామాల్లో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ గ్రామాల్లోని మూడు వేల మంది రైతులను, 450మంది మహిళలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రుపొందించినట్లు తెలిపారు. ఎంపిక చేసుకున్న గ్రామాల్లో పాఠశాలలు, వీధులు, విద్యుత్, తాగునీరు, తదితర అంశాలపై వారు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జానయ్య, ఎంఈఓ నిజాముద్దీన్, వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్, గ్రామ నాయకులు సోమశేఖర్‌గౌడ్, సుదర్శన్, అన్వర్ ఉన్నారు.

ఎస్‌ఐగా భువనయ్యకు పదోన్నతి

నారాయణపేట: జిల్లాలో స్పెషల్ బ్రాంచ్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న భువనయ్య ఎస్‌ఐగా పదోన్నతి పొందారు. గురువారం ఎస్పీ యోగేష్ గౌతమ్‌ను క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. భువనయ్యకు టూ స్టార్స్ తొడిగించి ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ శాఖలో పదోన్నతి ఉత్సాహంతో పాటు మరింత బాధ్యత పెంచుతుందన్నారు. విధి నిర్వహణలో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ మరింత ఉత్సాహంగా పనిచేసి ప్రజలకు మంచి సేవలు అందించాలని సూచించారు.

వ్యాధులపై అవగాహన ఉండాలి



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైఆర్‌జీ సంస్థ సభ్యులు

మద్దూరు: సీజనల్ వ్యాధులు, సుఖవ్యాధులైన హెచ్‌ఐవీ, టీబీ తదితర వ్యాధులపై ప్రజలకు కనీస అవగాహన ఉండాలని వైఆర్‌జీ సంస్థ ప్రతినిధులు సూచించారు. గురువారం మండలంలోని రెనివట్లలో వైఆర్‌జీ కేర్ ఆధ్వర్యంలో ఈ వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యాధులు రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సంస్థ డీఆర్‌పీ శ్రీకాంత్‌రెడ్డి, సూపర్ వైజర్ కృష్ణ, వర్కర్ బాల్‌రాజ్, ఆశా వర్కర్లు నాగేంద్రమ్మ, అనంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కోస్గిరూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం సాధ్యమవుతుందని ఏబీవీపీ రాష్ట్ర జెయింట్ సెక్రటరీ నరేష్‌తేజ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల మైదానంలో స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆటల పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో యువకులు, విద్యార్థులు, మత్తు, మాదకద్రవ్యాలు, మొబైల్ ఫోన్‌లకు అలవాటు పడి ఒంటరితనానికి అలవాటు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రతాప్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బద్రీనాథ్, ఎస్‌ఐ బాల్‌రాజ్, ప్రశాంత్ గౌడ్, శివరాం, శివ, అనిల్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యకు నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న రెడ్డప్ప

నారాయణపేట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీకి విరుద్ధంగా విద్యారంగానికి అత్యల్పంగా 7శాతం నిధులు కేటాయించి విద్యారంగాన్ని గాలికి వదిలేసిందని విద్యా పరిరక్షణ కమిటీ నేతలు రెడ్డప్ప, హైమావతి విమర్శించారు. గురువారం అంబేడ్కర్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసారి బడ్జెట్‌లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. ఈ నెల 8న నారాయణపేట మున్సిపల్ పార్క్ దగ్గర జరిగే ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు వెంకటప్ప, గజ్జలప్ప, ఉదయ్ కుమార్, డీటీఎఫ్ నాయకులు సూర్యచంద్ర, యువజన సంఘం నాయకులు మహేష్ పాల్గొన్నారు.